**ఈ వారం కథ**

# సెబాస్.. ఆడకూతురా..!

ప్రఫుల్లచంద్ర

బెజవాడ రైలు టేషన్ - అబ్బో - మహా కలకలగా వుంది. అమ్ముకునేటోల్ల అరుపులు - జనం గోల - పిల్లగోల్ల ఏడుపులూ-

ఆ రనగొన గోల సిరివెన్నెల్లో ఏనునాదం లాగ వుంది. కూలోడు సూటుకేసు పట్టుకెల్తా వుంటే ఎనకాలే నడుత్తున్నా.

నే నలాటిలాటోన్ని కాను గురువా! నా జేబులో ఫస్టుక్లాస్ టిక్కట్టుంది. అందుకే - దాన్సిగ దరగా - నా అడుగులు హుందాగా, మహా దరిజాగా పడుతున్నాయి.

ఫస్టుక్లాస్ బోగీలోకెల్లి కూపేలో నా సూటుకేసెట్టి బయట కొచ్చాడు కూలోడు. ఆడి సేతిలో ఐదు రూపాయిలెట్టా. మరో ఐదు యిమ్మని గొడవ! ఇచ్చిన ఐదూ లాక్కొని బూతులు తిట్టేశా. ఫస్టుక్లాసోడి నోటిలోంచి అలాంటి బూతులెప్పుడూ వినలేదు కాబోలు నిలువు గుడ్లేసుకొని నిలబడిపోయాడు ఎదవన్నర ఎదవ! ఆ పోజులో ఆడ్ని సూత్తొంటే గర్వంగా ఉంది. నవ్వుకుంటా కూపేలో అడుగెట్టా.

కూపేలో ఒకేపు సీటు మీద మొగుడు, పెల్లాం, ఇద్దరు పిల్లలు...

ఇటేపు సీటులో కూకుని ఆల్లవేపు జూశా.

మొగుడిది హెల్మెట్ లాంటి బట్టతల. సాదా సీదా గుమాస్తా లాగున్నాడు. ప్రభుత్వం కర్సు మీద ఫస్టుక్లాస్‌లో ఎల్తున్నాడు కాబోలు. పెల్లాం అటు దిరిగి ప్లాస్టిక్ బుట్టలో ఏదో ఎదుకుతోంది. దాని ముకం కనిపించలేదు గాని దాన్సిగ దరగ! మాంచి బందోబస్తుగా ఆఫీసర్ లెవెల్లో ఉంది! పిల్లలు అందంగా ఆరోగ్యంగా మిసమిస లాడతా వున్నారు.

నేనూ ఫది జిల్లాలకు అందగాన్నే. నా ముకం అమాస సంద్రుడు! నా కల్లు - ఎర్రగా పండిన టమాట పల్లు! జుట్టు - తుమ్మముల్లు!... హహహ... నేను నిజం నికార్సుగా సెబుతానండోయ్!

బండి కూతెట్టి బయలుదేరినాక ఆడి పెల్లాం యిటు దిరిగి నావేపు ఓరగా జూసిందండోయ్! దాన్సిగదరగ! తెలిసిన ముకంలాగే వుంది. ఎక్కడ జూశానబ్బా!... ఆ! గ్నాపకం వచ్చిందండోయ్!

ఇంటర్‌లో నా క్లాసుమేటు!

నా పేరు మదన్. ముద్దుపేరు... మదం! పొడవు ఆరడుగులైనా, పొగరు మాత్రం ఏడడుగులు! నన్ను జూత్తే లెక్చరర్లు గజగజ! అమ్మాయిలు గడగడ! సేయొద్దన్న పనే సేయడం నా హాబీ! ఎంత పెద్దోడ్ని అయినా జంకకుండా మొగం మీదనే తిట్టగలను! ప్రిన్సిపాల్ జూత్తుండగానే అమ్మాయిల జెడలు లాగగలను! వాచర్ జూత్తుండగానే పర్చీల్లో కాపీ కొట్టగలను!

ఈ పెద్దోల్లు మొదట అంతెత్తున గయ్‌మంటారు. తిడతారు. మనం బయపడకుండా గట్టిగా ఎటాక్ యిత్తే జాలు తోకలు ముడుసుకొని పరుగో పరుగు! ఎదిరించే వాడికి ఎదురే లేదు!

కాలేజీలో కొత్తగా సమక్ సమక్ తార కోమల జేరడంతో వాతావరణం కలకలలాడిపోయింది. దాన్ని కిస్ జేయమని ఫ్రెండ్స్ ఛాలెంజ్ చేసి బెట్ కాశారు. ఇంక తప్పుద్దా మరి! ఓ రోజు పట్టపగలు అందరూ జూత్తుండగా కోమల్ని గాఠిగా పట్టుకొని... ఎట్టేసుకున్నా... ముద్దెట్టేసుకున్నా

అది సిగ్గొంతపోయింది. రుసరుస బుసబుస లాడింది.

ప్రిన్సిపాల్‌కి రిపోర్ట్ చేసింది. ఆడేం జేత్తాడు! ఆడోక సవట!

సమ్మె సేయాలని అమ్మాయిల్నీ పోగేసింది కోమల.

'సమ్మో, గిమ్మో అంటే రేప్ కేసు పెడతా' అని బెదిరించినా. ఇక సూస్కోండి. దాన్సిగ దరగ! ఎగిరెగిరి పడిన జెడలన్నీ ముడుసుకుపోయాయి. సివరకు కోమల కాలేజీ ఒగ్గేసి పోయిందెక్కడికో.

ఆనక నేనూ కాలేజీ ఒగ్గేసి కంట్రాక్టు పనుల్లో కుదురుకున్నా. బాగా సంపాయించా. నాయకులతో లాయికీలు, పోలీసులతో పొత్తులూ పెరిగాక మనిసి ఎదగక ఏం జేత్తాడు! నేనూ ఎదిగిపోయా! నేనిప్పుడు పెద్దమనిసిని! నన్ను మదం అని పిలవ రిప్పుడు. గౌరవంగా 'మిస్టర్ మదం' అని పిలుత్తారు.


అయితే నేనిప్పుడు మనవి జేసేదేమంటే - పదేల్ల కితం నేను ముద్దెట్టుకొని ఒదిలేసిన కోమల ఇదిగో యిప్పుడు నా ఎదురుగ్గా కూకుని మొగుడితో కబుర్లు సెబుతోంది! దాన్సిగ దరగ! జున్ను ముక్క మీద స్ట్రాబెర్రీ పండు పెట్టినట్టు రంగుదేవి పిటపిటలాడుతోంది పిట్ట! తాటి ముంజల్లాంటి పెద్ద కల్లలో - నన్ను గుర్తించింది కాబోలు - కాసింత బయం!

పదేల్ల కితం ముద్దెట్టి వదిలేసిన పిట్ట మల్లీ యిలా ఎదురైందంటే దానికర్థం - దేవుడు మరో ఛాన్స్ యిత్తన్నాడన్నమాట!

బయటకు జూశా. బండి అనకాపల్లి దాటుతోంది. ఇశాపట్నం ఒచ్చేలోగా దాన్ని ఏదో సేసెయ్యాల - అని ఒల్లు టిమటిమ లాడిపోతోంది. హెల్మెట్ గాడు ట్రాన్సిస్టర్ సెవి దగ్గరెట్టుకొని వింటున్నాడు. మహిలా దినోత్సవం అట. ఎవర్తో





ఆడోల్ల గొప్పల గురించి కూస్తోంది! ఛా... ఆడోల్లు!

దాని మొగుడు నన్నెదిరించే పాటి మగాడు కాదని తెలుత్తానే ఉంది. నేను సెలరేగిపోవాలి. తప్పదు... టైమ్ సాలదు. పిల్లలిద్దరూ పత్రికలో జోక్స్ చదువుతూ నవ్వుకుంటున్నారు. అమ్మాయితో మాట కలిపినా. పేరు సీత అట. ఫస్ట్ చదువుతోందట! దీని పిలక దరగ! కోమల నోట్లోంచి ఊడి పడినట్టుంది.

'ఆడోల్ల కెందుకమ్మా సదువులు! ఇంచక్కా సదువు మానేసి నాలాటోన్ని పెల్లాడితే జీవితం సేఫ్‌గా ఎలిపోతాది. సదూకున్న సన్నాసిని పెల్లి సేసుకున్నావో, ఆడి కల్లెదుట ఎవరైనా నిన్ను రేప్ సేసినా ఆడు రచ్చించలేడు' అన్నా ఓరగా కోమల వేపు జూత్తా.

కోమలా, దాని మొగుడూ నావేపు కంపరంగా జూశారు. అసయ్యంగా జూశారు. కోపంగా జూశారు. అల్లని జూత్తేనాకేమో బుడ్డీ కొట్టినట్టుంది! ఈ సవటలు నన్నేం చేయగలరు!

'అమ్మాయిలు కాలేజీలో జేరి ఏం జేత్తారు? లైన్ ఏత్తారు? ఎర్రగా బుర్రగా వున్నోడి మీదకు ఎగబడతారు! అంతేగదా! నేనూ, మీ అమ్మా కాలేజీలో సదివే రోజుల్లో...'

'ఏమిటీ! నువ్వు కాలేజీలో చదివావా?' కుర్రది ఆచ్చెర్యపోయింది.

కోమల గజగజ! కల్లలో బయం! మొగుడు ముకంలో అనుమానం! బలే బలే! ఏదో సేసెయ్యాలి! ఎలా అడ్డుకుంటాడో సూడాలి!

'ఔను బుల్లీ! నేనూ, మీ అమ్మా కాలేజీలో సదివే రోజుల్లో అందరి ఎదుటా, పట్టపగలు... నన్ను... నన్ను... ఇదిగో ఇక్కడ మీ అమ్మ ముద్దెట్టుకుంది తెలుసా? అనుమానమైతే మీ అమ్మనే అడుగు' అన్నా.

అంతే. హెల్మెట్‌గాడూ, పిల్లలూ కోపంగా అసయ్యంగా కోమల వేపు జూత్తా వుండిపోయారు. కోమల ముకం నిన్న కోసిన ఎర్రగులాబీ లాగ వాడిపోయింది. కన్నీల్లు! ఇంక సెప్పొద్దు అని బతిమాలుతున్న కల్లు!... ఓహో, బలేబలే!

గర్వంగా మొగుడి వేపు జూసా. 'నువ్వు నమ్మవా? పోనీ ఇప్పుడు సూడు' అని సటుక్కున లేసి నిలుసున్నా.

ఆడది ఆకాసంలో సగం... అదీ ఇదీ... అంటూ ట్రాన్సిస్టర్ కూత్తోంది. రైలు ఏదో బ్రిడ్జి దాటుతోంది. దఢ్ దఢ్... ఆ శబ్దం ఆ మ్యూజిక్ నాకు బలే ఇష్టం.

కోమల కుంచించుకు పోతోంది. తప్పించుకోడానికి గాని, పారిపోడానికి గాని దారిలేదని తెలిసి బయంతో బెదిరిపోయే లేడికల్లు ఎంతందంగా ఉంటాయో తెలుసా? ఇదిగ ఇప్పుడు కోమల కల్లంత! లేడి ఏడుత్తోంది కదాని పులి పంజా ఇసరక మానుతుందా?

హహహ... ఇసురుతా... పంజా యిసురుతా!

నవ్వుకుంటా ఒకడుగు ముందుకేశా. మొగుడి ఎదుట రేప్ అయినా ఫర్వాలేదు గాని కన్నబిడ్డల ఎదుట అయితే బరించలేదు ఏ ఆడదీ! అలాంటి అరుదైన అవకాశం నాదే! ఎంతదృష్టం!

మొగుడు రచ్చించలేడని గ్రహించిన కోమల నా కాల్లట్టుకోడానికి తత్తరపాటుగా లేసి నిలుసుంది.

అది యింక నా కాల్ల మీద పడడమే తరవాయి...

నవ్వుకుంటా మరో అడుగు ముందుకేశా... అది ఒకడుగు ఎనక్కి...

హెల్మెట్‌గాడి ముకంలో బయం!

పిల్లల ముకంలో బెదురు!

సాష్టాంగపడటానికి సిద్ధంగా కోమల!

ఎంత త్రిల్లూ! ఎంత కిక్కూ! ఎంత మజా!!

అరచనం తమకంగా కల్లు మూసుకొని జరిగేది తలసుకుంటా మురిసిపోతా దరిజాగా, టీవిగా, సోగ్గా నిలబడ్డా.

ఆ అరచనంలో రైలింజన్ గాడిదలాగ ఓండ్రపెట్టింది. కాదు, కాదు... అది గాడిద ఓండ్ర కాదు; ఇంజన్ కూతా కాదు... అది సొయానా నా నోట్లోంచి ఊడిపడిన కూత!

నేనెందుకు కూశాను?

నాకేమయిందసలు?

గుండెలో మంట! నడుము నొప్పి!

కల్లు దెరిసి అయోమయంగా జూశా.

ఎదురుగ్గా కోమల కరాటే పోజులో నిలబడి ఉంది. ఆమె కల్లలో బయంలేదు! కన్నీల్లూ లేవు! నిప్పులున్నాయి!

హెల్మెట్‌గాడు నవ్వుతున్నాడు. పిల్లలూ నవ్వుతున్నారు.

ఏటిది! ఏటీ యిసిత్రం! ఏం జరిగిందసలు!

నన్ను నేను జూసుకున్నా. సీటు మీద ఎల్లకిలా పడున్నా.

కదిలితే చాలు నడుము కరేల్ మంటోంది. ఇరిగిపోయిందో ఏటో ఎదవ నడుం! కదలలేక అలాగే పడుండిపోయేను. తల కూడా పక్కకి తిప్పడానికి ఈల్లేకండా దిమ్ముగా వుంది.

ఆలోచిత్తా వుంటే కుంచెం కుంచెం అర్ధం అవుతా వుంది.

లేడికూన తంతే - ఎగిరిపడి ఎన్నెముక ఇరగ్గొట్టుకున్న పులిలాగ ఉంది నా ఎవ్వారం! అది లేడికూన కాదురో దేవుడో! అది సింహం! కరాటే నేర్చుకున్న కొదమ సింగం!

హెల్మెట్‌గాడు లేచెల్లి బోగీ సివర కూకున్న పోలీసోన్ని ఎంటబెట్టుకొచ్చాడు. ఈ మద్దిన ప్రబుత్వం ఫస్ట్‌క్లాసులో పోలీసోడ్ని కూకో బెడుతోంది లెండి. ఆడు రాగానే-

'వీడిని అరెస్ట్ చెయ్' గర్జించింది కోమల.

ఆ పోలీసోడొక ఎదవలెండి. ఇదేటిది! మద గజం లాంటి మొగాడేంటి మూల కూలిపోయి మూలుగుతున్నాడేమిటీ! ఆడకూతురేంటీ, ఆడ్ని అరెస్ట్ సెయ్యమని అరుత్తోందేంటీ - అర్ధంకాక ఎర్రిమొగం ఏసుకొని మిడుతూ, మిడుతూ జూత్తా వూరుకున్నాడు.

'ఏం! ఇంకా దిక్కులు చూస్తున్నావ్! నేనెవరో తెలుసా? ఈ జిల్లా యస్పీని! అరెస్ట్ హిమ్' అరిచింది కోమల.

ఇదేటిదీ! పెద్ద లెవెల్లో మాట్లాడతాంది! - అని జూత్తా వుండిపోయా. పోలీసోడు నాకు బేడీలేసి లేవదీసి నిలబెట్టాడు.

జీవితంలో మొదటిసారి ఓడిపోయా. అదీ ఆడదాని సేతిలో!

ఎటాక్ యిచ్చి ఆట కట్టించడం నా హాబీ. ఎదిరించేటోడికి ఎదురే లేదని నమ్మినవాన్ని. ఇప్పుడేమో ఓ ఆడది ఎటాక్ ఇచ్చి నా ఆట కట్టించింది. పైగా నా దగ్గరకొచ్చి... 'థాంక్యూ మిస్టర్ మదం' అంది.

సాల్సాలు లేవమ్మా! గుండెలదరగొట్టి పైగా తాంకులు సెబుతున్నావ్ - అందామనుకున్నా గాని అనలేకపోయా.

'వాడికెందుకు మమ్మీ థాంక్స్ చెబుతున్నావ్' అడిగింది కుర్రది.

'ఎందుకంటే - వాడా రోజు చేసిన వెధవ పని వల్లనే నాలో పట్టుదల పెరిగి ఐ.పి.ఎస్. అయి అలాంటి వెధవలకు బుద్ధి చెప్పాలన్న దీక్ష వహించాను. వాడానాడు ఆ వెధవ పని చేయకపోతే నేను యస్పీ అయేదాన్నే కాను!'

నా తల వాలిపోయింది. పగబట్టి పోలీసు ఆఫీసరై నా పొగరనిశావన్న మాట! సెబాసూ, ఆడకూతురా!

'లేచింది మహిళా లోకం...' పాట వస్తోంది ట్రాన్సిస్టర్ లోంచి- నన్ను పోలీసోడు లాక్కుపోతా వుంటే-

★

